

# బీదోని భూమి ఫ్రీగా దున్నుతున్న

ఎవుసం దండుగ అనుకున్న రోజులున్నయ్! దున్నకాల నుంచి కల్లం వరకు రైతు కష్టం అంతా ఇంతా ఉండదు. సీన్మాలల్ల, టీవీలల్ల చూయించినట్టు నిమిషాలల్ల ఒడిసే ముచ్చట కాదు. కాలంతో పరుగులు తీస్తనే అన్ని పనులెల్తయ్. మేం ఎన్ని తిప్పలు పడ్డా.. అప్పుడున్న కాంగ్రెస్ సర్కార్ మమ్మల్ని పట్టించుకున్న రోజు లేదు. ఇంకో ఆయనైతే ఎవుసమే దండుగ అన్నడు. తెలంగాణ వచ్చినాంకనే మా రాతలు మారినయ్. రైతుబంధుతోని పెట్టుబడి తిప్పలు పోయినయ్. నాకు 2018ల సబ్సిడీల ట్రాక్టర్ అచ్చింది. నేను 3 లక్షల 30 వేలు కడితే ప్రభుత్వం సబ్సిడీ కింద 3 లక్షల 30 వేలు ఇచ్చింది. నాకు ట్రాక్టర్ లేనప్పుడు మంది ట్రాక్టర్‌తోని దున్నిపిచ్చేది. ఇప్పుడు నా భూమి నేనే దున్నుకుంటున్న. సొంతంగ ట్రాక్టర్ ఉంది కాబట్టే కరెక్టు టైంకు నాట్లు అయిపోతున్నయ్. నా భూమి దున్నకం అయిపోయినాంక వేరే రైతుల భూములు కూడా దున్నుతున్న. నాకు సర్కార్ సాయం చేసింది కావట్టి, నా వంతు సాయంగా పేద రైతులకు ఫ్రీగ దున్నుతున్న. ఇయ్యాల తెలంగాణల ఎవుసం బతికి ఉన్నదంటే దానికి కారణం కేసీఆరే. ఆయన రైతుల ముఖ్యమంత్రి.

• ఎ.విష్ణువర్ధన్ రెడ్డి, రైతు, అచ్యుతాపూర్, వనపర్తి

## ముందుకు పోదామా! ఎన్కకా!!

కాంగ్రెస్ జమానా రైతులను ఆగం పట్టించింది. నిండా కరెంటు ఇవ్వలేని ఆ పార్టీ వ్యవసాయ యాంత్రీకీకరణలోనూ అదే ధోరణి ప్రదర్శించింది. వివిధ పథకాలతో వ్యవసాయం స్థిరీకరణకు కంకణం కట్టుకున్న కేసీఆర్ అన్నదాతలకు అడుగడుగునా అండగా నిలుస్తున్నారు. వ్యవసాయ పనుల్లో రైతులకు సాయంగా ఉండాలన్న ఉద్దేశంతో రాష్ట్రంలోని అన్నదాతలకు 19,607 ట్రాక్టర్లను బీఆర్ఎస్ ప్రభుత్వం పంపిణీ చేసింది. సమైక్య రాష్ట్రంలో బకాయిపడిన రూ.41 కోట్ల రవాణా పన్నును కూడా ప్రభుత్వం రద్దుచేసింది. వ్యవసాయ యాంత్రీకీకరణ పథకం ద్వారా ఇప్పటివరకూ ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 6 లక్షల మంది రైతులు లబ్ధి పొందారు.



# తెలంగాణ జైత్రయాత్ర 2023

హైదరాబాద్ | శనివారం 25 నవంబర్ 2023 నమస్తే తెలంగాణ

www.ntnews.com

I



## దేశానికి ఆదర్శం


ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ కావాలని, పరిపాలన వేగవంతంగా సాగాలని, ప్రగతి ఫలాలు ప్రతి గడపనూ తాకాలనీ మనం ఎన్నో సంస్కరణలు చేపట్టాం. ప్రతి జిల్లాలో కలెక్టరేట్లు ప్రారంభించుకున్నాం. అంతర్గత రక్షణ వ్యవస్థను పటిష్ఠపరిచేలా పోలీసు యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేసుకున్నాం. అన్ని రంగాల్లో గుణాత్మకమైన మార్పు కనిపిస్తున్నది. తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నది.

▪ కేసీఆర్

వాహ్ క్యా బాత్ హై

## ఫ్లాప్.. అట్టర్ ఫ్లాప్!

**ఓ సినిమాలో** శ్రీహరితో కోట శ్రీనివాస్‌రావు పదేపదే 'నా ఎదవతనంతో పోల్చుకుంటే నీ ఎదవతనం ఒక ఎదవతన మేంట్రా?' అని అంటుంటాడు. ఈ డైలాగ్ ఇప్పుడు ఎందుకు గుర్తొచ్చింది అంటారా? తెలంగాణ ఎన్నికల సమరంలో కాంగ్రెస్, బీజేపీ నేతల కవరింగ్ మాటలు కోటావారి మాటలను జ్ఞప్తికి తెస్తున్నాయి. అసలు కథేంటంటే.. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ పార్టీలు నిర్వహిస్తున్న సభలు ఘోరంగా ఫ్లాప్ అవుతున్నయి. దుబ్బాకలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మీటింగ్ పెడితే మనుషుల కంటే ఖాళీ కుర్చీలే ఎక్కువ కనిపించాయి. రేవంత్ సభ ఫెయిలయిందని బాధ పడుతున్న ఆయన అనుచరులు.. 'మా అన్న రాష్ట్ర అధ్యక్షుడే.. నల్లగొండలో ఏఐ



సీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ మా అన్న సభ కంటే భారీగా ఫ్లాప్ అయ్యింది. మా అన్నదేముంది!' అంటూ అనునయిస్తున్నారట. ఇక, నల్లగొండలో మీటింగ్ పెట్టిన కాంగ్రెసోళ్లు.. 'మా పార్టీ అధ్యక్షుడి మీటింగే కాదు నిజామాబాద్‌లో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా మీటింగ్ మాకంటే ఘోరంగా అట్టర్‌ఫ్లాప్ అయ్యింది' అంటూ కవర్ చేసుకుంటున్నరట. ఇట్లా మా సభ కంటే వాళ్ల సభ ఎక్కువ ఫెయిలైంది, వాళ్లకన్నా మాది కాస్తోకూస్తో బెటర్ అనుకుంటూ ఉభయ పార్టీల లీడర్లూ.. వంతపాడుకుంటున్నారు. వీళ్ల తీరు చూస్తుంటే కోట శ్రీనివాస్‌రావు డైలాగ్ గుర్తుకు రావడం సహజమే కదా!

• వరుణ్

ఖుల్లం ఖుల్లా



తరాలుగా దళితులను మీరు దగా చేసింండ్రు
ఓటు బ్యాంకు లెక్కనే వాళ్లనెపుడు చూసింండ్రు
నేడు చూడు వాళ్లంతా నిబ్బరంగా నిలుచుండ్రు
మిమ్ములను తరిమికొట్ట వారంతా వస్తుండ్రు

మీటర్లు పెట్టకుంటే నిధులు వాళ్లు ఇవ్వరట
మోటర్లు మార్చకుంటే వీళ్లు ఒదిలిపెట్టరట
పచ్చవడ్డ తెలంగాణ చూసి ఈ కడుపుమంట
ఓటుతోని బుద్ధి చెప్పి తరిమి తరిమి కొట్టమంట

... దండమూడి శ్రీచరణ్

పనిమంతుడు ఎవరు?





### ప్రతి లక్ష మందికీ 1,643 ఉద్యోగాలు

తెలంగాణలో అర్హులైన ప్రతి లక్ష మందికీ గడిచిన పదేండ్లలో బీఆర్ఎస్ సర్కారు సగటున 1,643 ప్రభుత్వ ఉద్యోగాలను ఇచ్చింది. రాష్ట్రంలో నిరుద్యోగిత రేటు 4 శాతం కంటే తక్కువ.



### ప్రతి లక్ష మందికీ 153 ఉద్యోగాలే

దేశంలోని అర్హులైన ప్రతి లక్ష మందికీ గడిచిన పదేండ్లలో కేంద్రంలోని బీజేపీ సర్కారు సగటున 153 ప్రభుత్వ ఉద్యోగాలను ఇచ్చింది. దేశంలో నిరుద్యోగిత రేటు ప్రస్తుతం 10.1 శాతంగా ఉన్నది.

"మిర్గం రాంగనె నింగి దిక్కు చూస్తడు రైతన్న. పడమటి దిక్కు వరదగుడి పడ్డది చూసి పొంగిపోతడు. ఊరించిన మేఘం ఉసూరుమనిపిస్తే.. అన్నదాత ఆగమే!

మారుతున్న కాలచక్రాన్ని అంచనా వేసి, నింగి జారిన ప్రతి చినుకునూ ఒడిసిపట్టి.. నేలతల్లికి చేరవేస్తున్న పాలకుడు రావడంతో తెలంగాణ కర్షకుల్లో హర్షాతిరేకాలు మొదలైనయ్. 24 గంటల కరెంటుతో ఆఖరి మడీ ఆనందంగా తడుస్తున్నది."

ఎవుసానికి మూడు గంటల కరెంటు చాలన్న టీపీసీసీ చీఫ్ రేవంత్ మాటలు అన్నదాతల్లో కలకలం రేపుతున్నాయి. టెన్ హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలన్న ఆయనగారి అజ్ఞానాన్ని తూర్పార పడుతున్నారు కరీంనగర్ రైతులు. జిల్లాలోని గోపాల్‌పూర్‌లో కలుసుకున్న అన్నదాతల అసలు ముచ్చట.. రేవంత్ కామెంట్లపై యావత్ తెలంగాణ రైతాంగం సంధించిన ఫిరంగి!

అసలు ముచ్చట



టెన్నెచ్చిపీ మోటర్లు

# ఎవడిత్తడు?

## రేవంత్‌యన్నీ ఫాల్తు మాటలు

- ఉట్టికెగరనోడు స్వర్గానికి ఎగురుతడా?
- మూడు గంటలు ఏ మూలకు సాల్తది!
- గంటకు ఎకరం ఎట్ల పార్తది
- 24 గంటల కరంటి బాగుంది
- కాంగ్రెసొస్తె మళ్లీ ఆగమే
- ఇది కరీంనగర్ రైతుల మాట..

**మంద తిరుపతి:** ఔను వీరన్నా! ఎన్నికల్ల మంచి చేస్తమని చెప్పాలి, ఉన్నదాన్ని ఊడగొడ్తమని కాంగ్రెసోళ్లు ఫాల్తు మాటలు మాట్లాడుతున్నరేంది! కాంగ్రెస్ ఉన్నప్పుడు కరంటి కట్టాలు మనకు తెల్వనియా!! ఎవుసానికి కరంటిచ్చుడు అంటనే ఆల్లకు పట్టింపు లేకపాయె. ఏడు గంటలని దొంగ రాత్రి మూడుగంటలు ఇచ్చిరి. ఇండ్ల సుత రెండు గంటలుంటె గొప్పుంటుండే! పదేండ్ల కింద ఎన్ని తిప్పలు పడ్డమో యాది కుందా! ఇప్పుడు రేవంత్‌రెడ్డి మూడు గంటలే సాలనవట్టె. పిదప కాలం కాకపోతే.. ఏం మాటలు గివ్వి!

**అనుముల వీరారెడ్డి:** మూడు గంటలిచ్చుడేంది తిరుపతి! గా మాట అనెతానికి కొద్దిగనన్న ఇజ్జతుండాలె. మీ జమానాల అప్పుడప్పుడిచ్చిన ఏడు గంటలే సరి పోలేదురాయ్యా! అంటే.. మూడు గంటలిత్తె సాలని ఒకటికి నాలుగుసార్లు చెప్పవట్టె. నిజంగనే ఆల్లొస్తే.. ఇస్తమన్న మూడు గంటలల్ల గిన ఆరుసార్లు కట్ చేస్తరు. గప్పట్ల కరెంట్ రాంగనె అందరు ఎగవడి ఒక్కపాలి మోటర్లు చాలు చేద్దురు. లో ఓల్టేజ్‌తోని మోటర్లు కాలుతుండె. వారానికోసారి ట్రాన్స్‌ఫార్మర్ ఎగిరిపోతుండె. ఆ ట్రాన్స్‌ఫార్మర్ సక్కగై అచ్చేసరికి పొలం ఎండిపోతుండె.

**అనుముల ఆదిరెడ్డి :** అవ్.. అంతెందుకే మన ఊల్లె మోటర్ వైండింగ్ షాపుల కరంటి మోటర్లు మండెలు వడి ఉండకపోవునా! వైండింగ్ పిల్లగాడు పొద్దుమాకుల పనిచేసినా.. మోటర్లు అస్తనే ఉంటుండె. ఇప్పుడు ఆ షాపే బంద్ అయి పాయె. గంతెందుకు, రాత్రి కరంటి పెట్టవోయి సచ్చిపోయినోళ్లు ఎంతమందిని చూసినం. రాత్రయితే ఇల్లు ఇడ్సిపెట్టి పొలంలనే ఉందుం. సుట్టపోడు పోయినా.. పోకపోతిమి. రాత్రి, పగలు బాయిల చుట్టే తిరుగుతుంటిమి. ఇప్పుడు గట్లున్నదాయె. బాజాప్త పొద్దంతనే అచ్చి ఎప్పుడు గావల్నంటే గప్పుడే పొలాలకు నీళ్లు వెట్టుకోవడ్తిమి.

**గోనె మల్లారెడ్డి :** నువ్.. చెప్పేటిది మంచిగనే ఉన్నది గాని మన తిరుపతి ఏమంటండు. మల్ల కాంగ్రెసత్తే ఎవుసానికి మూడు గంటల కరంటే ఇత్తరట. ఇదేమన్న సబబైన ముచ్చటేనా? గా మాట మాట్లాడెతానికి ఆల్లకు నోరెట్లచ్చిందంటవ్. ఆ పార్టీల ఎవుసం చేసేటోళ్లు ఎవలన్న ఉన్నరా లేరా..? ఇసొంటి బేకార్ మాటలు మాట్లాడ్తె మనమెట్ల ఊకుంటం.

**తిరుపతి:** ఈ మాటన్నది ఎవలోగాదె.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంతమే. ఎవుసానికి మూడు గంటలు సాలని అన్నప్పుడు నా పెయ్యంత మండింది. ఏదో మాటజారిండు అనుకుంటె.. టెన్నెచ్చిపీ మోటర్లు పెట్టుకుంటే గంటకు ఎకరం పారతదని సెప్తున్నడు. మూడెచ్‌పీ మోటర్ కొననీకే 30 వేలైతన్నయ్. టెన్నెచ్‌పీ ఏడికి వోయి తేవాలి. ఇంకోటెరికేనా.. టెన్నెచ్‌పీ మోటరు నీళ్లు ఎంత రువ్వడి మీదుంటయి. గా నీళ్లు కాలువల్ల పారిచ్చి పునాస పంటలు పండిచ్చుడు అయితదా..? కాలువలు ఏడికాడికి తెగిపోవా..? ఇసొంటి తెలివి తక్కువ ముచ్చట్లు రేవంతం ఎందుకు మాట్లాడుతండో ఏందో..

**దాడి లక్ష్మయ్య:** గీ మాటన్నోనికి ఏమన్న తల్కాయ గిట్ల ఖరాబైందటరా.. (అందరి నవ్వులు) లేకపోతే ఏందే! ఎవుసం మంచిగుండాల్ననే కేసీఆర్ సార్ 24 గంటల కరంటియ్యవట్టె. ఇప్పుడు గాడెవడో అచ్చి మూడు గంటలు మస్తయితదంటే మనం ఇనుకుంట కూసుంటమా.. ఏం చెయ్యాల్నో గది బరాబర్ చెయ్యాలె..

**తిరుపతి:** లచ్చన్న బరాబర్ చెప్పిండు. గిన్ని ఇగురాలు చేసి కేసీఆర్ సార్ మనకు మంచి చేత్తంటే.. ఆల్లకు కండ్లు మండుతన్నయి. పదేండ్ల కింద మన బతుకులు ఎట్లుండె? ఇప్పుడెట్లున్నయ్. ఒకసారి యాదికి తెచ్చుకోండ్రి. కరెంటుంటే నీళ్లు లేకపాయె. నీళ్లుంటే కరెంటు లేకపాయె. ఇప్పుడు కాళేశ్వరం కట్టి నీళ్లియ్యవట్టె. ఒకప్పుడు బాయిల నీళ్లు పాతాళంల ఉంటుండె. ఇప్పుడు ఎంత మీదికొచ్చినయ్. తోడినన్ని నీళ్లు ఊరుతున్నయ్. మీదికెళ్లి రైతుబంధు ఇయ్యవట్టె. అదృష్టం మంచిగలేక కాలంజేత్తే రైతుబీమా కింద ఐదు లక్షలిచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవట్టె.. గివన్ని కాంగ్రెసోళ్లతోని అయితదానె!

**అనుముల రాజిరెడ్డి:** గాళ్లతోని ఏమైతది. పక్కరాష్ట్రం కర్ణాటక ముచ్చట ఎట్లయిందో చూస్తనే ఉన్నం కదా! ఆడికెంచి అచ్చిన కాంగ్రెసోల్లు 'మాతాన ఐదు గంటలు కరంటిస్తున్నం' అని చెప్పవట్టె. ఈడ 24 గంటల కరంటి ఉంటే.. నువ్వొచ్చి ఐదు గంటల ముచ్చట రొమ్మిరిచి చెప్పుడేందో ఏమో! గీ మాయ మాటలు ఇని మోసపోనీకి మనం ఎడ్డోల్లం అనుకుండ్రేమో! తెలంగాణ అచ్చినంక మన విలువ పెరిగింది. కేసీఆర్ సార్ చెయ్యవట్టి ఇంత మొఖం తెల్లగైతంది. ఇప్పుడు మల్లొచ్చి మనల్ని కిందికి గుంజుతమంటె ఊరుకుందామా?

**ఏరువ రవీందర్‌రెడ్డి:** ఈల్ల కోతలిని.. ఓటేత్తిమంటే కరంటి కోతలు తప్పయ్. ఎన్కట సబ్‌టేషన్ కాడ ఎన్ని ధర్నాలు చేసినమో యాదికుంది కదా! తెలంగాణ అచ్చినంక మనం ఏనాడైనా సబ్‌టేషన్ తానికి పోయినమా? గీ ఫాల్తు మాటలు నమ్మనీకి ఇప్పుడు రైతులు ఎన్కటి లెక్క ఎడ్డోళ్లు కాదు. ఎవలు ఏందో, ఎవరి పాలన ఎట్లుందో తెలుసుకొని తెలివికొచ్చిండ్రు.

**తిరుపతి:** మనం సుతం ఆలోచించుకోవాలె.. అధికారంలకు రాకముందే ఎవుసానికి మూడు గంటల కరంటి సాల్తదని చెప్తే.. పుసుక్కున అధికారంలకు అస్తే.. బరాబరి చేసి తీర్తరు. మీదికెళ్లి మేం అప్పుడే చెప్పినమని బుకాయిస్తరు. ఇసొంటోళ్లకు ఓటెత్తమా ఏంది. ఇన్ని రోజులు మనల కంటికి రెప్పలెక్క కాపాడుకున్న కేసీఆర్‌ను మర్సిపోతమా. ఇన్ని సౌలతులు పొందుకుంట రైతనెటోడు కాంగ్రెస్‌కు ఓటేత్తాడె. రైతులంటెనే కేసీఆర్.. కేసీఆర్ అంటెనే రైతులు.

**లక్ష్మయ్య:** నేను పుట్టిన కాన్నుంచి గిట్వంటి సర్కారును కండ్ల జూడలే! ఎవ్వడు ఏమన్న అనుకోనియ్యండ్రి. మన ఓట్లయితే కేసీఆర్ సార్‌కే.. మల్ల అయ్యిదేండ్లదాక నేను బతికుంటే అప్పుడు సుత నా ఓటు కేసీఆర్‌కే. తెలంగాణ రాక ముందు రైతును ఎవ్వడన్న ఎట్లున్నవని అడిగినోడు ఉన్నడా?

**తిరుపతి :** గిదైతే నిజం.. అప్పుడు పదెకరాల ఆసామి సుతం రొండెకరాలు దున్నెతానికి ఆలోసిస్తుండె. నీళ్లు లేక, కరంటి రాక పెట్టువడి పోతదా అని భయపడుతుండె. ఇపుడు మస్తు నీళ్లుండె.. 24 గంటలు కరంటి ఉంది. అప్పుడు ఎంత పంట వండింది.. ఇప్పుడు ఎంత వండుతాంది. పదెకరాలు ఉన్నోడు ట్రాక్టర్ వడ్లు వండితే సంబురపడేది. ఇప్పుడు వడ్లు గుంజుడికి ట్రాక్టర్లు సరిపోతున్నయా? కరంటి లేకుంటే గిట్ల పండిచ్చెటోళ్లమేనా! టెన్నెచ్చిపీ మోటర్లు వెట్టుకొమ్మనే కాంగ్రెస్‌కు ఓటెద్దమా? 24 గంటల కరంటిచ్చే కేసీఆర్‌కు ఓటేద్దమా..?

**లక్ష్మయ్య:** చెప్పనే వడ్డి.. నేను మల్లొచ్చే ఐదేండ్లకు సుతం కేసీఆర్‌కే ఓటేత్త.. ఎవడు ఏం చేసుకుంటడో చేసుకోనియ్!!

... డి.వెంకటస్వామి 📷 ఎ.బాలు

థౌజండ్ వాలా..

